www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -172 గురువారం 8 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# జంతర్‌మంతర్ ఉద్రిక్తం

## రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు అరెస్ట్





**దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు..**

**ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం**

**జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన!**

**నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
ఢిల్లీలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విపక్ష ఎంపీల సమావేశం అనంతరం, ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంకావడంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరును ఖండిస్తూ, ఆయన రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు. జంతర్ మంతర్ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మిగతాది 2లో...

# వికసిత భారత్ లక్ష్యం సాధిద్దాం

## 'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం

**ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ**

**2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. మిగతాది 2లో...



# ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

**అణువుల రహస్యాన్ని ఛేదించిన పరిశోధన..**

**ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్నో సోయ్‌లకు పురస్కారం**

**అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. మిగతాది 2లో...

# రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ

**ఎస్‌డీఎఫ్ రేటు 5.25 శాతానికి చేరిక**

**ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.75 శాతానికి పెంపు**

**ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక**

**క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిన ప్రభావం**

**రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలపై అంచనాలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. మిగతాది 2లో...

# రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

**ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ**

**గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ**

**రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై 2లో...



# పోరాటం ఆగదు

**అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై రేవంత్ రెడ్డి అసహనం**

**ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి**

**రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు**

**ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్**

**ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ మిగతాది 2లో...



# రూ.40,000 కోట్ల భారం ఎవరిది?



## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

**బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ**

**గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి**

**జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం**

**హైదరాబాద్, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ. 40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత మిగతాది 2లో...

# యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

**ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం**

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**



**హైదరాబాద్, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు మిగతాది 2లో...

# రెండు డీఏలు విడుదల

**సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ**

**రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం**

**తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న**

**రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ**



# వికసిత భారత్ లక్ష్యం సాధిద్దాం

**(మొదటి పేజి తరువాయి)**

సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

**సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం**

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్దత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.

**సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం**

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

## రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ

**(మొదటి పేజి తరువాయి)**

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.

**పెరుగుతున్న ద్రవ్యోల్బణం**

ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది.

**క్రూడ్ ధరల ప్రభావం**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు.

ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.

**ముందస్తు చర్య అవసరం**

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు.

## రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

**(మొదటి పేజి తరువాయి)**

కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు.రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి.ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.రేపు (అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని రేపు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.

## పోరాటం ఆగదు

**(మొదటి పేజి తరువాయి)**

కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు.అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు

## రెండు డీఏలు విడుదల

**హైదరాబాద్, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**

కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది.2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

## రూ.40,000 కోట్ల భారం ఎవరిది?

**(మొదటి పేజి తరువాయి)**

వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్‌ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇద్దరు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీ నోబెల్

**(మొదటి పేజి తరువాయి)**

ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది.

అసమాన సేంద్రియ సంశ్లేషణలో నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ.

ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

## జంతర్‌మంతర్ ఉద్రిక్తం

**(మొదటి పేజి తరువాయి)**

ప్రధాని మోదీ, కేంద్ర హోంమత్రి అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని, వాటిని తాను మెడల్స్ భావిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, 100 మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలుద్దామని 300 మంది వెళితే మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్‌మంతర్‌కు బయలుదేరగా, వారిని అడ్డుకోవడానికి వందలాది మంది భద్రతా బలగాలు మోహరించాయి. ఈ క్రమంలో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా-శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు. వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది. మంగళవారం రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత రాహుల్, ప్రియాంక గాంధీ సహా కొందరు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే దిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనేది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

**(మొదటి పేజి తరువాయి)**

జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు,




అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# అయ్యప్ప సేవకులకు ఘన సత్కారం

## ప్రతి అమావాస్యకు 40 వేల మందికి అన్నప్రసాదం

## సేవా కార్యక్రమాలకు నిర్వాహకుల ప్రోత్సాహం



**హైదరాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 7,** అయ్యప్ప భక్తుల ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలను ప్రోత్సహించే ఉద్దేశంతో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప గురుస్వాములు, శిబిరాల కమిటీ సభ్యులకు ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న పలువురు గురుస్వాములు, నిర్వాహకులను శాలువాలతో సత్కరించి అభినందించారు. లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ ప్రతి నెల అమావాస్య రోజున హవన కార్యక్రమాలు, ప్రతి వారం ఇంటింటా భజనలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తున్న సేవకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ప్రతి అమావాస్య రోజున సుమారు 40 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న వివిధ అయ్యప్ప శిబిరాల కమిటీ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు ఆర్.ఆర్.దేశ్ పాండే గురుస్వామి (రాజు దేశ్ పాండే),జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ దేవయ్య పటేల్ గురుస్వామి, జాతీయ కార్యదర్శి ప్రేమ్ గాంధీ గురుస్వామి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమ నరేంద్ర గురుస్వామి, ఉపాధ్యక్షులు గణేష్ గుప్త గురుస్వామి, యువ విభాగం బుక్క కిట్టు గురుస్వామి (కిట్టు), రాంప్రసాద్ గురుస్వామి, నరేందర్ గురుస్వామి, కర్ణాటక యువ విభాగం ఆదిశేష గురుస్వామి, రంగారెడ్డి జిల్లా నుంచి మహేష్ గురుస్వామి, ప్రేమ గురుస్వామి, బండి గోపాల్ గురుస్వామి, ఆలయ నిర్వాహకులు అజయ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప భక్తుల సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం అందించడం, సమాజంలో భక్తి, సేవా భావాలను విస్తృతం చేయడమే సమితి ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# సినిమా కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా కాకర్ల గోవర్ధన్‌రావు



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 7,**
పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సేవలను గుర్తించి కాకర్ల గోవర్ధన్‌రావును బీజేపీ సినిమా కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గోరెడ్డి గిరివర్ధన్‌రెడ్డి సూచనల మేరకు,బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నియామకం చేపట్టారు. కార్మికుల సంక్షేమం, విభాగం బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకుర్తి శేషగిరిరావు, రాపాక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోగోలో అతిపెద్ద యానిమే క్రాసోవర్




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి ):**పోగో ఆధ్వర్యంలో 'రైజ్ ఆఫ్ అంశక్స్: హీరోస్ ఆఫ్ డెస్టినీ'సరికొత్త యానిమే-ప్రేరణ సిరీస్‌గా తెరకెక్కుతోంది. ఇందులో తొలిసారిగా ఛోటా భీమ్, లిటిల్ సింగం ఒకే విశ్వంలో కలిసి సాహసాలు చేయనున్నారు.వెలుగుచీకటి మధ్య జరిగే పోరాటం నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో కొత్త హీరోలు, సూపర్‌హీరోలు, విలన్లు ప్రేక్షకులను అలరించనున్నారు.ఒక్కో ఎపిసోడ్ గంట నిడివితో ఉండనుందనీ పేర్కొంది.అక్టోబర్ 11 నుంచి ప్రతి ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు పోగోలో ప్రసారం కానుంది.హిందీ, ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ,మరాఠీ భాషల్లోనూ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.ం

# ఎంపీ నిధులతో గ్రామాలకు అభివృద్ధి బాట

## రూ.10.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం..

## ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో సిసి రోడ్లు..

## నానాజీపూర్ సర్పంచ్ మైలారం సురేఖ రాజు





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 7,**
గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎంపీ నిధులను సద్వినియోగం చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నానాజీపూర్ గ్రామంలో చేవెళ్ల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.10.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలోని ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.చాలా కాలంగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాజేంద్రనగర్ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ,ఎంపీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. సర్పంచ్ మైలారం సురేఖ రాజు మాట్లాడుతూ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో నానాజీపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల విజయ్‌కుమార్, వార్డు సభ్యులు సిద్ధులు, సుకుమార్, రాధిక శ్రీను, సుధాకర్ యాదవ్,కవిత కృష్ణగౌడ్, ప్రేమలత రాములుగౌడ్, జయమ్మ జగన్‌తో పాటు గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ముచింతల్‌లో రూ.13.10 లక్షలతో సీసీ రోడ్లు



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 7,** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచింతల్ గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.13.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలోని ప్రజలకు రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకమన్నారు. నాణ్యమైన రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. చాలాకాలంగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముచింతల్ గ్రామ ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణంతో ఉపశమనం లభిస్తుందని చెప్పారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ లాడ్స్ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ముచింతల్ గ్రామ సర్పంచ్ కత్తుల సుభాష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

# రామంజపూర్‌లో రూ.12.30 లక్షలతో సీసీ రోడ్లు

## ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి





**శంషాబాద్ (ప్రహవినికిడి): అక్టోబర్ 7,**
గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నిధులను సద్వినియోగం చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.
శంషాబాద్ మండల పరిధిలోని రామంజపూర్ గ్రామంలో ఎంపీ నిధులతో రూ.12.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రాకపోకల సమస్యలు తొలగి ప్రజలకు సౌకర్యం కలగనుంది.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని అన్నారు.చాలా కాలంగా రోడ్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణంతో ఉపశమనం లభిస్తుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి పనులను చేపడతామని చెప్పారు. రామంజపూర్ సర్పంచ్ మూడవత్ లావణ్య దేవేందర్ మాట్లాడుతూ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో డిప్యూటీ కమిషనర్ పర్యటన

## వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమంలో పౌర సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన





**గండిపేట్, (ప్రజావినికిడి): అక్టోబర్ 7,**వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ ఖానాపూర్ గ్రామం,126వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పలు పౌర సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్.. పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఫిరంగి నాలా పరిశుభ్రత, భూగర్భ మురుగు కాలువల సమస్య, తాగునీటి కొరత, దోమల బెడద, రహదారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఫిరంగి నాలాను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని భూగర్భ మురుగు కాలువలను పరిశీలించి, మురుగునీరు నిల్వ కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామంలో సుమారు 1.5 కిలోమీటర్ల మేర రహదారి అవసరముందని స్థానికులు కోరగా, సమస్యను పరిశీలించి సాధ్యమైన మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. గుర్తించిన సమస్యలపై ఇంజినీరింగ్, శానిటేషన్, ఇతర విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "వన్ డేవన్ వార్డ్" కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారాలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్, బిల్ కలెక్టర్ రవీందర్ రెడ్డి, వార్డు ఆఫీసర్ ప్రభాకర్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం,వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తత గ్రామాల్లో పంటల సమస్యలపై శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పరిశీలన

## రైతులకు శాస్త్రీయ సూచనలు పంటల యాజమాన్యంపై అవగాహన

**శంషాబాద్, (ప్రజావినికిడి):**
శంషాబాద్ మండలంలోని దత్తత గ్రామాలైన కాచారం, రాయన్నగూడలో వివిధ పంటల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, రైతులకు శాస్త్రీయ సూచనలు అందించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ( పీజేటిఏయు), హైదరాబాద్‌కు చెందిన అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఈ సందర్భంగా వరి,గులాబీ, చామంతి,బెండ, మిరప,టమాట తదితర పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులు శ్రీనివాస్, యాదయ్య, జంగయ్య తదితరుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. వరి పంటలో కంకి నల్లి,పొటాష్ లోపం, గులాబీలో బ్లాక్ స్పాట్, టమాటలో తెగుళ్లు,బెండలో ఆకు




పురుగు సమస్యలను గుర్తించారు.వరి పంట ప్రస్తుతం పొట్ట దశ నుంచి ఈనిక దశలోకి వస్తున్నందున చివరి దశలో యూరియాతో పాటు పొటాష్‌ను తప్పనిసరిగా అందించాలని శాస్త్రవేత్తలు సూచించారు. కంకి నల్లి నివారణకు ఎకరానికి 200 మిల్లీలీటర్ల స్పైరోమెసిఫెన్ మందును 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. గులాబీ, చామంతి పంటలు ప్రస్తుతం మొగ్గ దశలో ఉన్నందున సూక్ష్మ,స్థూల పోషకాల ఫర్టిగేషన్ షెడ్యూల్‌పై రైతులకు అవగాహన కల్పించారు. టమాటలో తెగుళ్ల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.ఈ క్షేత్ర సందర్శనలో సీనియర్ శాస్త్రవేత్త (వరి) డా.శ్రీధర్ సిద్ధి, ప్లాంట్ బ్రీడింగ్ సైంటిస్ట్ డా.లక్ష్మి ప్రసన్న, కీటక శాస్త్రవేత్త డా. అరుణశ్రీ, ఉద్యాన శాస్త్రవేత్త డా.యూ. స్రవంతి, శంషాబాద్ మండల వ్యవసాయాధికారి శ్వేత,ఉద్యాన, వ్యవసాయ విస్తరణ అధికారులు కిషోర్,లక్ష్మణ్ పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కలిసి రైతుల పంట సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సాంకేతిక సలహాలు, సూచనలు అందించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# తుడుందెబ్బ మండల కమిటీల ఎన్నిక

**ఆదివాసి హక్కుల కోసం యువత పోరాడాలి**

**డిసెంబర్ 9 చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు పిలుపు**

**తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణకుమార్**



**వాజేడు,అక్టోబర్ 8,(ప్రజావినికిడి):** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ వాజేడు నూతన మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా.మైపతి అరుణకుమార్ హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల అస్తిత్వం కోసం యువతీ, యువకులు ముందు వరసలో ఉండాలన్నారు. డిసెంబర్ 9 చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు వాజేడు మండలంలోని చెరుకూరు గ్రామం నుంచి పిలుపు నిచ్చారు.ఏజెన్సీ ప్రాంతాల్లో దోపిడీకి గురి అవుతున్న నీరు, అడవి,భూమి, విద్య,వైద్యం, ఉద్యోగాల విషయంలో ఉద్యమించాలని కోరారు.
అనంతరం తుడుందెబ్బ మండల కమిటీ, ఆదివాసి విద్యార్థి సంఘం మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా అట్టం శివకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా పట్టం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మొడెం సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆలేం సురేష్, ఉపాధ్యక్షులుగా గొంది యోగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గుండెబోయిన శరత్, కోశాధికారిగా మడే రవి, కార్యవర్గ సభ్యులుగా వాసం రవి, కుర్సం శ్రీకాంత్, కార్యదర్శులుగా గొంది మల్లిఖార్జున్, ఆలం కిషోర్ ఎన్నికయ్యారు.
ఆదివాసి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా గొంది మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇరుప భరత్, ఉపాధ్యక్షులుగా అట్టం సంపత్ కుమార్,వాసం బాలు,కార్యవర్గ సభ్యులుగా బండారి ఉదయ్, మడి వేణు, యలం రవికుమార్, బోదబోయిన సమ్మయ్య, కుడుముల తరుణ్ ఎన్నికయ్యారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర కార్యవర్గంలోకి చింత మోహన్, జిల్లా ఉపాధ్యక్షులుగా పద్దం సుధాకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా గొంది రామ లక్ష్మణ్ ఎన్నిక కాబడ్డారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అట్టం సుభద్ర, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిషే బాలకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగ గణేష్, తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూణేం చంటి,ఆదివాసి యువత, యువకులు, ప్రజలు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం



**వాజేడు, అక్టోబర్ 8,(ప్రజావికిడి):** కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం అపాయింట్మెంట్ కోరగా నిరాకరించడంతో ధర్నా నిర్వహించి సర్ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని ఈసీ జ్ఞానేశ్ కుమార్ ను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయడం జరిగింది. ధర్నాలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకూడదని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా దశల వారి ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్రమంత్రి అమీషాను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వాజేడు మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కె ఖాజావలి పశువుల లక్ష్మణ్ ఎస్కే సాబీర్ పాషా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌కు ఘన వీడ్కోలు

**ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసిన పోలీసు అధికారి**



**వాజేడు,అక్టోబర్ 8,(ప్రజావినికిడి):** పేరూరు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ వాజేడు మండల కమిటీ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ, సాధారణంగా పోలీసులను చూస్తే అమాయక ఆదివాసీ ప్రజలు భయపడుతుంటారని,అయితే ఎస్సై కృష్ణ ప్రసాద్ మాత్రం ఆదివాసీలతో సోదరుడిలా, పెద్దలకు కొడుకులా మెలుగుతూ ప్రజల సమస్యలను ఆప్యాయంగా విని పరిష్కరించేందుకు కృషి చేశారని అన్నారు.ఆదివాసీ యువతకు పెద్ద అన్నయ్యలా మంచి చెడులు చెబుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో వారి ఇళ్ల వద్దకే వెళ్లి సహాయం చేసిన ఆయన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. చిన్న కార్యక్రమమైనా, పెద్ద కార్యక్రమమైనా ఆదివాసీ ప్రజల మధ్యకు వచ్చి కలిసిపోయే ఆయన తీరు అందరి మనసులను గెలుచుకుందని తెలిపారు.తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి పాయం జానకి రమణ మాట్లాడుతూ, కృష్ణ ప్రసాద్ చేసిన సేవలు పేరూరు ప్రాంత ఆదివాసీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. బదిలీపై వెళ్తున్నప్పటికీ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి తిరిగి ఆదివాసీ ప్రాంతానికి రావాలని ఆకాంక్షించారు.అనంతరం వాజేడు మండల కమిటీ తుడుందెబ్బ నాయకులు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల కమిటీ నాయకులు, ఆదివాసీ యువత,గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# అడ్డదారిలో అక్రమ నిర్మాణాల జోరు..

**342 సర్వే నంబర్‌లో నిబంధనలకు తూట్లు -అనుమతులు ఒకటైతే.. నిర్మాణాలు మరొకటా..?**

**టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..? చర్యలు ఎక్కడ..?**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నిర్మాణ నిబంధనలు బహిరంగంగానే ఉల్లంఘిస్తున్నారా..? అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వార్త కథనాలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 342 సర్వే నంబర్ పరిధి కైసర్ నగర్ లో భారీ నిర్మాణాలు కొనసాగుతున్న తీరుపై స్థానికుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
నిబంధనల ప్రకారం నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి. అనుమతులకు అనుగుణంగానే అంతస్తులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ విస్తీర్ణం ఉండాలి.కానీ అనుమతులు ఒకలా.. క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోలా సాగుతున్నాయన్నఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కళ్లముందే నిర్మాణాలు.. అధికారులకు కనిపించవా..?**

భారీ భవన నిర్మాణాలు సాగుతున్న సమయంలో సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉంటే వెంటనే నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
కానీ ఇక్కడ మాత్రం నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు వేచి చూస్తున్నారు..?

**అధికారుల పర్యవేక్షణ లోపమా..?**

లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారా..?
అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేయడం మాత్రమే అధికారుల పని కాదని స్థానికులు మండిపడుతున్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణం ఆగిందా? నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చివేత చర్యలు ఎందుకు చేపట్టలేదు? అని ప్రశ్నిస్తున్నారు.
ఒకవైపు సామాన్య ప్రజలు చిన్న నిర్మాణం చేపట్టినా అనుమతులు, నిబంధనల పేరుతో అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటే.. మరోవైపు భారీ నిర్మాణాలు ఇంత బహిరంగంగా సాగుతున్నాయంటే చట్టం అందరికీ సమానమేనా..? లేక పలుకుబడి ఉన్నవారికి ప్రత్యేక నిబంధనలున్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు 'అధికారిక' రక్షణ ఉందా..?**

ఇంత పెద్ద స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మౌనం అక్రమ నిర్మాణదారులకు పరోక్ష ప్రోత్సాహంగా మారుతోందా..? అన్న చర్చ జరుగుతోంది.
నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలు మరిన్ని పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి
342 సర్వే నంబర్‌లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి.
అసలు ఎలాంటి అనుమతులు ఇచ్చారు..?



అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు జరుగుతున్నాయా..?
ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది..?
క్షేత్రస్థాయిలో ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు..?
నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు..?
ఈ ప్రశ్నలన్నింటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు బహిరంగంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.
అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే.. అధికారులు నిబంధనలు కాపాడుతున్నారా? లేక అక్రమ నిర్మాణాలను కాపాడుతున్నారా? అన్న అనుమానం ప్రజల్లో మరింత బలపడటం ఖాయం.
ప్రజల డిమాండ్ ఒక్కటే..
అనుమతులు ఉంటే చూపించండి.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి.. అక్రమమైతే అడ్డుకోండి..
అధికారుల నిర్లక్ష్యానికి ఇకనైనా చెక్ పడుతుందా..? లేక అక్రమ నిర్మాణాలకు ఇదే అడ్డాగా మారుతుందా..?

## లింగపేట, దర్మవరం, పట్టాలాండ్ ఇసుక క్వారీలను, నిలుపుదల చెయ్యండి



**వాజేడు,అక్టోబర్ 8,(ప్రజావినికిడి):** లింగపేట, ధర్మవరం,పట్టా ల్యాండ్ ఇసుక క్వారీలను తక్షణమే నిలుపుదల చేయాలని వాజేడు మండల బిఆర్ఎస్ పార్టీ అద్యక్షుడు పెనుమల్ల రామకృష్ణ రెడ్డి మండల తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లింగపేట, ధర్మవరం,పట్టా ల్యాండ్ ఇసుక క్వారీలు అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి ఇవి రెవిన్యూ సర్వే గోదావరి ఓడ్డుమీద ఉన్నటువంటి పట్టా ల్యాండ్లను రెవెన్యూ సర్వే చేయించి తనకు అనుకూలమైన ప్రదేశాన్ని చిత్రీకరించి వాటిపై అనుమతులను పొంది రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చేలా చేసినారు ఇట్టి ఇసుక క్వారీ నిర్వహించడం వలన గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోవడం అంతే కాకుండా లక్షలాది రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారు కావున రెవెన్యూ అధికారులు విచారణ జరిపించి నిజ నిజాలు తేలే వరకు లింగపేట, ధర్మవరం,ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## క్రాంతి నగర్‌లో రూ.16 లక్షల సిఎంసి నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని క్రాంతి నగర్‌లో సిఎంసి నిధులు రూ.16 లక్షల వ్యయంతో 110 మీటర్ల పొడవున నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చోట నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి,నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ బాల్ రెడ్డి, పద్మారావు, మనోజ్ పాల్గొన్నారు.అలాగే శ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు బుగ్గ రెడ్డి,క్రాంతి నగర్ అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోట హరిబాబు, కాంగ్రెస్ నాయకులు నరేష్,నవీన్ కుమార్, నరసింహులు, కృష్ణ,జగదీష్, భాషా,శ్రవణ్ మరియు క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ లో నెలకొన్న సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపే దిశగా జోనల్ కమిషనర్ పర్యటన..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని,బాక్స్ నాలా నిర్మించాలని కోరుతూ 04-10-2026 డిప్యూటీ కమిషనర్ కి సంబంధిత కాలనీ వాసుల తరఫున రిప్రజెంటేషన్ సమర్పించడం జరిగింది.ఈ రిప్రజెంటేషన్‌కు స్పందించిన జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తో కలిసి బుధవారం 07-10-2026 ఉదయం శ్రీ దుర్గయ్య స్టేట్ కమ్యూనిటీ హాల్‌కు విచ్చేసి.అనంతరం హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, ఏరోనాటికల్ ఎంక్లేవ్ అదేవిదంగా శ్రీ రాఘవేంద్ర కాలనీలలో పర్యటించి వర్షపు నీటి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు.
బాక్స్ నాలా నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు (ప్రపోజల్స్) సిద్ధం చేసి,సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడం



జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గయ్య స్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మధుసూదన్ రావు,హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంటా సిద్దిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, ఏరోనాటికల్ ఎంక్లేవ్ అసోసియేషన్ అధ్యక్షులు కీర్తి కనకయ్య, రాఘవేంద్ర కాలనీ అధ్యక్షులు నారాయణ,



సతీష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.అధికారులు కాలనీలలో పర్యటించి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కమిషనర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికల్లో సరైనా గుణపాఠం చెప్పేలా నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల సమన్వయంతో పనిచేయాలి

## : బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..



**కుత్బుల్లాపూర్; (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 129-సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నందు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన సదస్సుకు బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, మరియు కార్యకర్తలు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,
మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి.గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి.ం ాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ ని మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు.కానీ నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అన్యాయం యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ కుత్బుల్లాపూర్ నుంచి సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్,డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్,సీనియర్ నాయకులు కొండకళ్ళ శ్రీనివాస్ రెడ్డి, చెక్క సురేష్, బషీరుద్దీన్,లక్ష్మీ నారాయణ, ఫిరోజ్,దొడ్ల శ్రీను, సాజిద్, సాయిబాబా, రోషన్,అఖిల్, హేమలత రెడ్డి, అమృత రెడ్డి, లావణ్య, షెహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి గ్యార్మీ వేడుకలు నిదర్శనం

**వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి - రామ్‌నగర్ కాలనీలో వైభవంగా గ్యార్మీ వేడుకలు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** మున్సిపాలిటీ పరిధిలోని చటన్‌పల్లి పరిధిలోని రామ్‌నగర్ కాలనీలో లడ్డు(ఇబ్రహీం)ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్యార్మీ మహోత్సవంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీలోని దర్గాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొని,గ్యార్మీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,గ్యార్మీ పండుగ ఆచారాలు మానవత్వానికి, నిస్వార్థసేవకుప్రతీకలని,సమాజంలో మతసామరస్యం, సోదరభావం పెంపొందాలని, ఇస్లామిక్ సంస్కృతిలో గ్యార్మీ (ఫీర్వీ షరీఫ్)పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని,పేదలను ఆదుకోవడం అలాగే సమాజంలో శాంతిని నెలకొల్పడమే ఈ పండుగ యొక్క అసలైన సందేశమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు ఈశ్వర్ రాజు,చిన్న యాదగిరి,పాలమాకుల చెన్నయ్య,కంటెస్టెడ్ కౌన్సిలర్ సలీం,నాయకులు లడ్డు (ఇబ్రహీం)బాలరాజ్, రాందాస్,బాలు,వెంకటేశ్వర్ రెడ్డి,అలీ,గౌస్, చాన్ ఫాషా,అఖిబ్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గించిన జీతాలు పెంచండి

## వేతనాల తగ్గింపుపై ఏడో రోజు నల్లబ్యాడ్జీలతో నిరసన

## షాద్‌నగర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినపురపాలక సిబ్బంది



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** వేతనాల తగ్గింపును నిరసిస్తూ షాద్‌నగర్ పురపాలక సంఘంలోని పనుల పరిశీలకులు, కంప్యూటర్ నిర్వాహకులు ఏడో రోజు నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు.గత జులై 12న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల కారణంగా గతంలో అందుతున్న వేతనాలు తగ్గాయని ఉద్యోగులు పేర్కొన్నారు.ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం..పనుల పరిశీలకులకు గతంలో రూ.22,750 వేతనం చెల్లించగా, ప్రస్తుతం రూ.16,600కు తగ్గించినట్లు తెలిపారు. కంప్యూటర్ నిర్వాహకుల వేతనం రూ.19,500గా పేర్కొన్నారు. వేతనాల తగ్గింపుతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు,ఇంటి అద్దెలు,రుణాల వాయిదాలు, నిత్యావసర ఖర్చులు భరించడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రమంలో ఉద్యోగులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించి, గతంలో చెల్లిస్తున్న వేతనాలను తగ్గించకుండా యథావిధిగా కొనసాగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.గత రెండు నెలలుగా తగ్గించిన వేతనాలను తీసుకోకుండా తమ నిరసన కొనసాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. పురపాలక సంఘాల్లో ప్రజలకు సంబంధించిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిరంతరం విధులు నిర్వహిస్తున్న తమ వేతనాలను తగ్గించడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మాకు అదనపు వేతనం కావాలని అడగడం లేదు. గతంలో చెల్లిస్తున్న వేతనాలను తగ్గించకుండా కొనసాగించాలన్నదే మా ప్రధాన డిమాండ్ అని ఉద్యోగులు స్పష్టం చేశారు.వేతనాల తగ్గింపుతో ఏర్పడిన సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనిఉద్యోగుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గతంలో చెల్లిస్తున్న వేతనాలను యథావిధిగా కొనసాగించాలని పనుల పరిశీలకులు, కంప్యూటర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు

# మెదక్‌లో ఘనంగా సేవ సంకల్ప అభియాన్, సేవా జ్యోతి కలశ యాత్ర..



**మెదక్,(ప్రజావినికిడి):**
భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా జ్యోతి కలశ యాత్ర ఘనంగా నిర్వహించారు.మెదక్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద సేవా జ్యోతి కలశ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు హాజరయ్యారు.అనంతరం రాందాస్ చౌరస్తా నుంచి బీజేపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాదయాత్రగా పాల్గొని పోస్టాఫీసు కూడలి వరకు చేరుకున్నారు.అక్కడ సేవా జ్యోతి కూడలి గా పేరు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రారంభమైన ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ,
ప్రజాసేవ,సుపరిపాలన,దేశ అభివృద్ధి లక్ష్యాలతో సాగుతున్న సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి,సంగసని సురేష్,పట్టణ అధ్యక్షుడు నాని



ప్రసాద్ మెదక్ కౌన్సిలర్ అఖిలాభారత్ పబా రాజమణి లక్ష్మణ్ బెండవీన, కలిపి నాగరాజు నల్లాల విజయ్ లోకేష్ అల్లం మధు,యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లికా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గ్యాన్సింగ్ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్,వెల్మకన్నె రాజేందర్ శంకర్ గౌడ్,ఎంఎల్ఎన్ రెడ్డి,నాయకులు, మండల అధ్యక్షులు,జిల్లా పదాధికారులు,మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

**ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ - ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఒక్క ఓటు కూడా దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపగలదని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన పౌరుల పేర్లు పొరపాటున తొలగించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లకు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునే అవకాశం, అభ్యంతరాలు తెలిపే అవకాశం స్పష్టంగా కల్పించాలని అన్నారు.మేము విద్యార్థులం నేటి విద్యార్థులమే రేపటి ఓటర్లం. ఓటు మా హక్కు. ప్రజాస్వామ్యం మా బాధ్యత అని పేర్కొన్నారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎంపిక విధానాన్ని కూడా శ్రీకాంత్ ప్రశ్నించారు. గతంలో ఉన్న విధానం ప్రకారమే కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎంపిక జరగాలని, ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత,సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎంపికకు సంబంధించి ఇటీవల తీసుకొచ్చిన చట్టాన్ని మార్చాలని కోరారు.2002లో ఓటు హక్కు ఉన్న వ్యక్తి పేరు ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎందుకు కనిపించడం లేదు? అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు ఎందుకు ఉండటం లేదు అని శ్రీకాంత్ ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును




కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ఆదిల్, రామ్‌చరణ్, తరుణ్,బబ్లు, రవీంద్ర,వంశీ, ధను,భాను, విష్ణు,భరత్, జగదీష్, సాయికిరణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎక్సైజ్ శాఖ జిల్లా,స్థానిక అధికారులు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మొక్కలను జ్ఞాపికగా బహుకరించారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే శంకర్‌తో అధికారులు చర్చించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డితో పాటు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ

## చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయాలి:గడ్డం శేఖర్ యాదవ్



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 7,** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని వరుసగా రెండోసారి అరెస్టు చేయడాన్ని శంషాబాద్ మండలం నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అరెస్టుల చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, వాటిని అణచివేయడానికి అరెస్టులను మార్గంగా ఉపయోగించడం సరికాదని శేఖర్ యాదవ్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గళాన్ని వినిపించాలని కోరారు.

# విద్యార్థినులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా విద్యను అభ్యసించాలి

**షాద్ నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి**

**కందివనం కేజీబీవీలో పోషణ్ మా కార్యక్రమం**

**జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి..**

**సమతుల్య ఆహారంతో ఆరోగ్యంగా ఎదగాలి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
విద్యార్థినులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని షాద్ నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కందివనం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక-శారీరక ఆరోగ్యం, విద్యాభ్యాసంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థినులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తగ్గించి,వాటికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మానసిక,శారీరక దృఢత్వాన్ని పెంచుకునేందుకు ప్రతిరోజూ తగిన వ్యాయామం, శారీరక కదలికలు అలవాటు చేసుకోవాలని చెప్పారు.
వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అనారోగ్య





సమస్యలను నివారించవచ్చని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిశుభ్రమైన ఆహారం,నీటిని తీసుకోవాలని విజయలక్ష్మి సూచించారు. ప్రతి విద్యార్థిని తన జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని,ఆ లక్ష్య సాధన దిశగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఆమె తెలిపారు. చదువుతో పాటు ఆరోగ్యం,మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత,ఆశా కార్యకర్త సునీత, పాఠశాల ఉపాధ్యాయులు గౌరీ,మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకం :నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి

## రంగారెడ్డి జిల్లాలో ఘనంగా వికసిత భారత్ సంకల్ప సభ సేవా జ్యోతి యాత్ర






**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభ-సేవా జ్యోతి యాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కాళీ మందిర్, ఆరి హైస్కూల్ సమీపంలోని వి.వి.ఎస్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,ఎంపీ ధర్మపురి అరవింద్,బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రత్నం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.దేశ సేవ,ప్రజా సంక్షేమం,అభివృద్ధి కోసం మోదీ అందించిన సేవలనునాయకులు,కార్యకర్తలు స్మరించుకున్నారు25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం దేశానికి స్ఫూర్తిదాయకం: నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక విశిష్టమైన మైలురాయి అని అన్నారు.దేశ సేవను ధ్యేయంగా చేసుకుని ప్రజా సంక్షేమం,దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మోదీ సేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**25 ఏళ్ల ప్రజాసేవ దేశ అభివృద్ధి కోసం నిరంతర కృషి**

వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం అనే సంకల్పంతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని అన్నారు.వికసిత భారత్ నిర్మాణం కోసం దేశ ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధానినరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.భారత్ మరింత అభివృద్ధి సాధించి ప్రపంచంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, వికసిత భారత్ సంకల్పం సాకారం కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్ గౌడ్,మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జ్ శ్రీరాములు యాదవ్,తొకల శ్రీనివాస్ రెడ్డి,బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్, మహిళా మోర్చా నాయకులు మమత,లావణ్య,ఉమ,అభినవ్ గౌడ్,షాద్‌నగర్ నియోజకవర్గ అశోక్ గౌడ్,నరసింహ గౌడ్,వెంకోలా వెంకటేష్,మోహన్ సింగ్, విటాయల నరసింహ,నరేష్, శివశంకర్,శివలింగం,ప్రశాంత్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు

## ఎక్స్‌టర్నల్ మూల్యాంకన కేంద్రం పరిశీలన.. పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా..





**శంషాబాద్, (ప్రహవినికిడి): అక్టోబర్ 7,** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం శంషాబాద్ మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శంషాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 6,9వ తరగతుల ఎక్స్‌టర్నల్ మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు.పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6, 9వ తరగతి విద్యార్థుల సమ్మేటివ్-1 జవాబు పత్రాల మూల్యాంకనం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారుకాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మూల్యాంకన ప్రక్రియను డీఈఓ పరిశీలించి, వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రాళ్లగూడ ఎంపీపీఎస్, సాతంరాయి ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించి తరగతి గదులు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రభాకర్‌కు సన్మానించిన 6వార్డు సభ్యుడు లింగారం మహేష్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఫరూక్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన సంగెం ప్రభాకర్ ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా 6 వార్డు సభ్యుడు లింగారం మహేష్ డాక్టర్ ప్రభాకర్‌కు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.డాక్టరేట్ పట్టా సాధించడం గొప్ప అభినందనీయమని పేర్కొన్న మహేష్ ,మీరు పడిన కష్టం,మీ కృషి,పట్టుదల ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలి.మీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా అందిస్తూ మరింత ముందు ముందుకు సాగాలి అంటూ డాక్టర్ ప్రభాకర్‌కు తెలిపాడు తన విజయాన్ని గుర్తించి శుభాకాంక్షలు తెలిపిన మహేష్ ఆయన కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ఈ సందర్భంగా తెలిపారు.ఈ సన్మానోత్సవ కార్యక్రమంలో శ్రీకాంత్ బిజెపి ఎస్సీ మోర్చ ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు,లింగారం శ్రీను పాల్గొన్నారు.



# దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే

## అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరం ముందుకు సాగాలి:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారిదేనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు.నాగోల్ డివిజన్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ నాయకత్వంలో దళిత బంధు పథకం ద్వారా మరింత పెద్ద సంఖ్యలో అర్హులైన దళితులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి దళితులను మోసం చేసిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో దళితులంతా ఐక్యంగా ఉండి ముందడుగు వేస్తున్నారని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు గోల్కొండ మైసయ్య, మల్లెపాక యాదగిరి, ఉమామహేశ్వర్, పార్శపు శ్రీధర్, మద్దెల నర్సింహ, రుద్రల స్వామి, కడారి పెంటయ్య, రెడ్డి మాల పెద్ద కృష్ణ,స్కైలాబ్, కోదండ సురేష్, కొత్తపేట ప్రభాకర్, రాజేందర్,దప్పు వినోద్,కటేపక రవి,చెంగల్ చంద్ర మోహన్,కొంగర మహేష్, గౌరీశంకర్, సంగిపేట నరేష్, గోపి,మధు, జలేందర్,నరేష్, శ్రీనివాస్,ఏర్పుల గాలయ్య, ఏర్పుల యాదయ్య, మహిళా నాయకులు అనిత,పద్మ, విజయలక్ష్మి, నిర్మల,జ్యోతి, రేణుక,లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టిజిపిసిబి కృషి

## కాలుష్య మూలాల నియంత్రణకు ప్రభావవంతమైన చర్యలు -కాలుష్య మూలాల నియంత్రణపై సెక్రటేరియట్‌లో సమావేశం

**హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజావినికిడి):**
తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ రోజు సెక్రటేరియట్ లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి గారు కమిటి మెంబర్ కన్వీనర్ గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, ఛీజూగ్రా నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి, కమిటి సభ్యులకు వివరించారు. వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు అలర్ట్ ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఎల్సిఎస్ లను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎల్సిఎస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్ల వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఛీజూగ్రా) కింద చేపడుతున్నారు.



మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసి వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో ఈవీ లకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. పీయూసి వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 పీయూసి కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసి గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. ఆర్టీసి ప్రస్తుతం జీహెచ్ఎంసి పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో వాయు కాలుష్యానికి కారకమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐటీ బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టిజిపిసిబి, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. ఈ అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు. తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్ ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి యునైటెడ్ నేషన్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్ తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపు పై చర్యలు చేపడుతున్నది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరించి, రాష్ట్ర స్థాయి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతున్నది. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే చర్యలు కూడా ప్రతిపాదనలు సమర్పించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ ప్రాంతాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యవేక్షణకు సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు. డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఉద్గార నియంత్రణ పరికరాల అదనపు అమరిక లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెల్లెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైంది. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ప్రత్యేకంగా సమీక్షించింది. హైదరాబాద్‌లో కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగారెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది.

# శ్రేయస్ అయ్యర్ దూకుడు.. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి



భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ తాజా టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం సాధించిన అయ్యర్ ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.ఇది అయ్యర్ అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్. తాజా జాబితాలో భారత ఆటగాళ్ల హవా కొనసాగుతోంది. ఇషాన్ కిషన్ 1వ స్థానంలో, అభిషేక్ శర్మ 2వ స్థానంలో, శ్రేయస్ అయ్యర్ 7వ స్థానంలో, తిలక్ వర్మ 10వ స్థానంలో నిలిచారు. దీంతో టాప్-10లో భారత్‌కు చెందిన నలుగురు బ్యాటర్లు ఉన్నారు.

# తొలి టీ20లో మా తప్పిదాలే ఓటమికి కారణం

### వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ వ్యాఖ్యలు

భారత్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో తమ జట్టు చేసిన తప్పిదాలే ఓటమికి ప్రధాన కారణమని వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ పేర్కొన్నాడు. కీలక సమయాల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోలేకపోయామని తెలిపాడు. భారత్ వంటి పటిష్టమైన జట్టుపై ఆడుతున్నప్పుడు ప్రతి విభాగంలోనూ మరింత అప్రమత్తంగా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు.తొలి టీ20లో వెస్టిండీస్ బ్యాటింగ్ సమయంలో మంచి ఆరంభం లభించినప్పటికీ దానిని భారీ స్కోరుగా మలచడంలో విఫలమైంది. మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోవడం, భాగస్వామ్యాలను ఎక్కువసేపు కొనసాగించలేకపోవడం జట్టు స్కోరుపై ప్రభావం చూపింది. చివర్లో కూడా ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోవడంతో భారత్‌కు




అందుబాటులో ఉండే లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగలిగామని షై హోప్ పేర్కొన్నాడు.భారత జట్టు లక్ష్య ఛేదనలో మాత్రం ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన బ్యాటింగ్‌తో వెస్టిండీస్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. కీలక సమయంలో శతకం సాధించి భారత విజయాన్ని సులభతరం చేశాడు. దీంతో వెస్టిండీస్ నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ తక్కువ ఓవర్లలోనే ఛేదించి ఘన విజయం సాధించింది.తమ జట్టు ఆటతీరుపై సమీక్ష చేసుకుంటామని షై హోప్ తెలిపాడు. ముఖ్యంగా కీలక దశల్లో తీసుకున్న నిర్ణయాలు, ఫీల్డింగ్‌లో జరిగిన పొరపాట్లు, బౌలింగ్‌లో లైన్ అండ్ లెంగ్త్ తప్పడం వంటి అంశాలను సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. తదుపరి మ్యాచ్‌లో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చి సిరీస్‌లో పుంజుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు.భారత్‌తో ఆడే ప్రతి మ్యాచ్ తమకు ఒక మంచి పరీక్షలాంటిదేనని, ఇలాంటి బలమైన ప్రత్యర్థిపై చిన్న తప్పిదాలు కూడా మ్యాచ్ ఫలితాన్ని మార్చగలవని షై హోప్ పేర్కొన్నాడు. తొలి మ్యాచ్‌లో జరిగిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుని తదుపరి మ్యాచ్‌లో సమష్టిగా రాణించేందుకు ప్రయత్నిస్తామని తెలిపాడు.

## ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమానికి వెళ్లేందుకు
# కోహ్లీకి రూ.5 కోట్లు ఇచ్చారా?

### ఆరోపణలను ఖండించిన విరాట్ కోహ్లీ ప్రతినిధి.. అవన్నీ నిరాధారమని స్పష్టం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీకి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన రూ.5 కోట్ల వ్యవహారంపై ఆయన ప్రతినిధి స్పష్టత ఇచ్చారు. బృందావనంలోని ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించేందుకు కోహ్లీకి రూ.5 కోట్లు చెల్లించారంటూ వస్తున్న ఆరోపణలను ఆయన ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, వాస్తవాలకు విరుద్ధమైనవని స్పష్టం చేశారు.శ్రీకృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్ అధ్యక్షుడు దినేశ్ శర్మ, ఫలహారీ మహారాజ్‌గా ప్రసిద్ధి చెందిన వ్యక్తి ఈ ఆరోపణలు చేసినట్లు సమాచారం. 2023లో కోహ్లీ తొలిసారి ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించేలా చేయడానికి రాజస్థాన్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ, రియల్ ఎస్టేట్ వర్గాలు రూ.5 కోట్లు ఖర్చు చేశాయని ఆయన ఆరోపించారు. ఆశ్రమానికి, ప్రేమానంద్ మహారాజ్‌కు మరింత ప్రచారం కల్పించడంలో భాగంగానే ఈ మొత్తం ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు మద్దతుగా ఇప్పటివరకు ఎలాంటి ధృవీకరించబడిన చెల్లింపు రికార్డు, ఒప్పందం లేదా ఇతర ఆధారాలు బహిర్గతం కాలేదు.ఈ నేపథ్యంలో





కోహ్లీ ప్రతినిధి స్పందిస్తూ.. విరాట్ కోహ్లీ ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని డబ్బుల కోసం సందర్శించలేదని స్పష్టం చేశారు.

ఆయనకు మహారాజ్‌పై ఉన్న విశ్వాసం, గౌరవం కారణంగానే ఆశ్రమానికి వెళ్తారని తెలిపారు. కోహ్లీ ఆశ్రమం నుంచి గానీ, ప్రేమానంద్ మహారాజ్ నుంచి గానీ ఎలాంటి డబ్బు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలను ప్రచురించే ముందు మీడియా సంస్థలు వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు.విరాట్ కోహ్లీ, ఆయన భార్య అనుష్క శర్మ గత కొన్నేళ్లుగా ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని పలుమార్లు సందర్శించారు. 2023 జనవరి 4న వారి తొలి ప్రముఖ సందర్శన జరిగినట్లు సమాచారం. ఆ తర్వాత కూడా పలుమార్లు ఆశ్రమానికి వెళ్లారు. దీంతో కోహ్లీకి ప్రేమానంద్ మహారాజ్‌తో ఉన్న అనుబంధం కొత్తది కాదని తెలుస్తోంది.ప్రస్తుతం రూ.5 కోట్ల చెల్లింపు ఆరోపణపై ఎలాంటి ధృవీకరించబడిన ఆధారాలు బయటకు రాకపోవడంతో, దానిని వాస్తవంగా కాకుండా ఆరోపణగా మాత్రమే చూడాల్సి ఉంటుంది. కోహ్లీ ప్రతినిధి చేసిన ఖండనతో ఈ వ్యవహారంపై ఆయన వైఖరి స్పష్టమైంది.



## మెస్సీ అంతర్జాతీయ కెరీర్‌కు
# భావోద్వేగ వీడ్కోలు

ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ తన 21 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు పలికాడు. బ్యూనస్ ఎయిర్స్‌లోని ఎస్టాడియో మాన్యుమెంటల్‌లో బెనిన్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో అర్జెంటీనా 30తో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ పెనాల్టీ ద్వారా ఒక గోల్ చేయడంతో పాటు మరో రెండు గోల్స్‌కు అసిస్టులు అందించాడు.85 వేల మందికి పైగా అభిమానుల సమక్షంలో జరిగిన ఈ మ్యాచ్ మెస్సీకి అర్జెంటీనా జెర్సీలో 208వ మ్యాచ్‌గా నిలిచింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతని గోల్స్ సంఖ్య 126కు చేరింది. అర్జెంటీనాకు 2022 ప్రపంచకప్‌తో పాటు రెండు కోపా అమెరికా టైటిళ్లు అందించడంలో మెస్సీ కీలక పాత్ర పోషించాడు.మ్యాచ్ అనంతరం అభిమానులను ఉద్దేశించి మెస్సీ భావోద్వేగానికి గురయ్యాడు. అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున ఆడటం తన జీవితంలో ఎంతో గర్వకారణమని పేర్కొన్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికినప్పటికీ క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నాడు.

# యూత్ టెస్టులో తన్మయ్ బలోడా ప్రపంచ రికార్డు



**అహ్మదాబాద్:** భారత్ అండర్-19 జట్టు ఆస్ట్రేలియాపై రెండో యూత్ టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 20తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయానికి భారత యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా ప్రధాన కారణంగా నిలిచాడు.తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన బలోడా.. రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఎనిమిది వికెట్లు తీసి ఆస్ట్రేలియా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 73 పరుగులు మాత్రమే ఇచ్చి 14 వికెట్లు పడగొట్టి యూత్ టెస్టు చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు.ఇంతకుముందు ఈ రికార్డు న్యూజిలాండ్ మాజీ స్టార్ టిమ్ సౌథీ పేరిట ఉండేది. 2007లో భారత్ అండర్-19పై సౌథీ 92 పరుగులిచ్చి 12 వికెట్లు తీసుకున్నాడు. తాజాగా బలోడా 14 వికెట్లతో ఆ రికార్డును బద్దలు కొట్టాడు.మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకు, రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులకు ఆలౌటైంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 315 పరుగులు చేయడంతో 141 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం 11 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా ఛేదించి 10 వికెట్ల విజయాన్ని అందుకుంది.

# అగార్కర్‌కు గంభీర్ భావోద్వేగ వీడ్కోలు

### భారత క్రికెట్‌లో కీలక విజయాల వెనుక అగార్కర్ పాత్రను గుర్తుచేసుకున్న టీమిండియా కోచ్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియడంతో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆయనకు భావోద్వేగ వీడ్కోలు పలికాడు. అగార్కర్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నాడు. జట్టు ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేసిన అగార్కర్.. కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదని గంభీర్ ప్రశంసించాడు.అజిత్ అగార్కర్ చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత జట్టు పలు కీలక విజయాలను అందుకుంది. ముఖ్యంగా ఐసీసీ టోర్నీల్లో భారత్ సాధించిన విజయాల్లో సెలక్షన్ కమిటీ తీసుకున్న నిర్ణయాలు ఎంతో కీలకంగా నిలిచాయి. ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో అగార్కర్ కీలకంగా వ్యవహరించారని గంభీర్ పేర్కొన్నాడు.అగార్కర్ నిర్ణయాలు తీసుకునే విషయంలో ఎంతో స్పష్టతతో ఉండేవాడని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టు విజయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాడని గంభీర్ కొనియాడాడు.




సెలక్షన్ సమయంలో సహజంగానే విమర్శలు, ప్రశ్నలు ఎదురైనా వాటిని పట్టించుకోకుండా జట్టు అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రశంసించాడు. అగార్కర్‌తో కలిసి పనిచేయడం తనకు ఎంతో గౌరవంగా, ప్రత్యేకమైన అనుభవంగా నిలిచిందని గంభీర్ చెప్పాడు.

**మూడు ఐసీసీ ట్రోఫీల్లో కీలక పాత్ర**

అగార్కర్ చీఫ్ సెలక్టర్‌గా ఉన్న సమయంలో భారత జట్టు మూడు ప్రధాన ఐసీసీ టోర్నీల్లో విజేతగా నిలిచింది. 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ విజయాల్లో జట్టు ఎంపిక ప్రక్రియ ఎంతో కీలకంగా నిలిచింది. ఈ విజయాలు భారత క్రికెట్‌లో అగార్కర్ పదవీకాలానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.గంభీర్ తన సందేశంలో అగార్కర్ సేవలను ప్రత్యేకంగా గుర్తుచేస్తూ.. భారత క్రికెట్ చరిత్రలో ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నాడు. భవిష్యత్తులో అగార్కర్‌కు మరిన్ని విజయాలు, మంచి అవకాశాలు రావాలని ఆకాంక్షించాడు. ఆయనతో కలిసి పనిచేసిన కాలాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని గంభీర్ భావోద్వేగంగా స్పందించాడు.

**"చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది"**

అగార్కర్‌కు వీడ్కోలు చెబుతూ గంభీర్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. "చరిత్ర మిమ్మల్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. భవిష్యత్తులో మీకు మరింత మంచి జరగాలని కోరుకుంటున్నాను" అంటూ గంభీర్ తన సందేశాన్ని ముగించాడు.2023 జూలైలో భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అజిత్ అగార్కర్.. దాదాపు మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగాడు. ఈ కాలంలో భారత జట్టు సాధించిన అంతర్జాతీయ విజయాలు ఆయన పదవీకాలానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. తాజాగా ఆయన పదవీ కాలం ముగియడంతో గంభీర్ చేసిన భావోద్వేగ వీడ్కోలు సందేశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# మైసూరులో కీలక షెడ్యూల్..

## 'దాదా' షూటింగ్‌లో తిరిగి అడుగుపెట్టిన బాలయ్య



నటసింహం నందమూరి బాలకృష్ణ గాయం నుంచి పూర్తిగా కోలుకుని మళ్లీ సినిమా సెట్స్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆయన, దర్శకుడు గోపీచంద్ మలినేనితో చేస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా' షూటింగ్‌లో పాల్గొన్నారు. కర్ణాటకలోని మైసూరులో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకుని విరామం తీసుకున్న బాలకృష్ణ, ఇప్పుడు పూర్తి ఉత్సాహంతో తిరిగి చిత్రీకరణలో చేరారు. చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం.. మైసూరులో జరుగుతున్న ఈ షెడ్యూల్ చాలా కీలకమైంది. ఇందులో ప్రధానంగా టాకీ పార్ట్‌తో పాటు బాలకృష్ణ, ఇతర ముఖ్య నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌తో సినిమా నిర్మాణంలో ఒక ముఖ్యమైన దశ పూర్తవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. బాలకృష్ణ పూర్తి ఆరోగ్యంతో తిరిగిరావడంతో చిత్ర యూనిట్‌లో కొత్త జోష్ నెలకొంది. గతంలో కాకినాడలో ఈ సినిమాకు సంబంధించిన ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ కండరానికి స్వల్ప గాయమైన విషయం తెలిసిందే. వైద్యుల సలహా మేరకు ఆయన పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఒక చిన్న శస్త్రచికిత్స చేయించుకున్నారు.

ఆ సమయంలో నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ఓ ప్రకటన విడుదల చేస్తూ, బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే సెట్స్‌కు తిరిగి వస్తారని అభిమానులకు భరోసా ఇచ్చింది. చెప్పినట్టుగానే, ఆయన ఇప్పుడు పూర్తి ఆరోగ్యంతో షూటింగ్‌లో చేరారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'దాదా'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.

బాలకృష్ణను పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో చూపిస్తూ, స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రంలో మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా పదునైన సంభాషణలు రాస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# 'హనుమాన్ అంశ్' తెలుగులోను సంచలనం సృష్టించేనా?



ఈ మధ్య కాలంలో చాలా మంది మాట్లాడుకున్న సినిమానే ' హనుమాన్ అంశ్'. ఎక్కడ చూసినా ఈ సినిమాను గురించిన చర్చలే నడిచాయనడంలో ఎలాంటి సందేహం లేదు. హిందీలో ఈ సినిమాను కేవలం 2 కోట్ల రూపాయలతో నిర్మించారు. దర్శకుడు విశాల్ చతుర్వేది కూడా ఒక నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా 400 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టడం విశేషం. ఇటీవల కాలంలో ఇంత తక్కువ బడ్జెట్ లో నిర్మాణం జరుపుకుని ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమా ఇదేనని చెప్పుకోవచ్చు.

ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్రనే 'హనుమాన్ అంశ్' పేరుతో తెరకెక్కించారు. ఉత్తర ప్రదేశ్ కి చెందిన నీమ్ కరోలీబాబా, చాలా చిన్న వయసులోనే అనేక అద్భుతాలు చేశారు. ఆయన హనుమను ఎక్కువగా ఆరాధించేవారు. ఆయనను అంతా హనుమంతుడి అంశావతారంగానే భావించేవారు. సత్యం .. ధర్మం .. ప్రేమ అనే మూడు విషయాలను గురించి ఆయన ఎక్కువగా ప్రస్తావించేవారు. అలాంటి నీమ్ కరోలీ బాబా గురించి తెరకెక్కించిన ఈ సినిమా, విడుదలైన అన్ని ప్రాంతాలలో వసూళ్ల వర్షాన్ని కురిపించింది. ఈ సినిమాను ఈ నెల 9వ తేదీన తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. దక్షిణాదిన నీమ్ కరోలి బాబా గురించి తెలిసినవారి సంఖ్య తక్కువే. ఈ సినిమా తరువాతనే ఆయన గురించి ఎక్కువమంది సెర్చ్ చేశారని చెప్పాలి. మరి ఈ సినిమా దక్షిణాదిన ఏ స్థాయి రెస్పాన్స్ ను రాబడుతుందనేది చూడాలి.

# సమంత ఎలిగెంట్ లుక్.. బ్లాక్ కేప్‌లో గ్లామర్ ట్రీట్!





:

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న గ్లామర్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. టెక్స్చర్డ్ బ్యాక్‌డ్రాప్ ముందు డ్రామాటిక్ బ్లాక్ కేప్-స్టైల్ టాప్, షిమ్మరింగ్ సీక్వెన్స్ స్కర్ట్‌లో ఆమె కనిపిస్తున్న తీరు అందరినీ కట్టిపడేస్తోంది. గర్భవతిగా ఉన్న ఈ సమయంలో తన బేబీ బంప్‌ను ఎంతో అందంగా ఫ్లాంట్స్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ అద్భుతమైన ఫోటోషూట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సమంత తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ సాటిన్ హై-నెక్ బ్లౌజ్‌తో అదరగొట్టింది. ఫ్లోర్-లెంగ్త్ కేప్ స్లీవ్స్ ఆమె లుక్‌కు రాయల్ టచ్ తీసుకొచ్చాయి. డార్క్ బ్రాంజ్, బ్లాక్ సీక్వెన్స్ ఎంబెలిష్‌మెంట్‌తో ఉన్న హై-వైస్టెడ్ స్కర్ట్‌లో ఆమె ఎంతో స్టైలిష్‌గా కనిపించింది. ఇక అమృత సింగ్, పూజా కరణ్ స్టైలింగ్‌తో ఈ లుక్ మరింత హైలైట్ అయింది. అ ఈ ట్రెండీ లుక్‌ను మరింత హైలైట్ చేయడానికి సమంత ప్రత్యేకమైన యాక్సెసరీస్ ధరించింది. అభిలాషా బ్రాండ్‌కు చెందిన ఇయర్ రింగ్స్, నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్ రింగ్స్, రివర్ స్టోర్ ఫుట్‌వేర్ జతచేసింది. ఇక టీజ్ మేకప్, ఆరతి షణ్ముగం హెయిర్ స్టైలింగ్ ఆమె అందాన్ని మరింత పెంచాయి. 'మా ఇంటి బంగారం' బ్లాక్‌బస్టర్ విజయం: సినిమాల పరంగా సమంత ఇటీవల తన స్వంత నిర్మాణంలో వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రంతో భారీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఏకంగా 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ లేడీ-ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామాతో నటిగా, నిర్మాతగా తన సత్తా చాటింది. ఇక ప్రస్తుతం సోనీ విజా వేదికగా వస్తున్న 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' షోకి హోస్ట్‌గా వ్యవహరిస్తూనే, నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'రక్త బ్రహ్మాండ్' షూటింగ్‌లోనూ పాల్గొంటోంది. వ్యక్తిగత జీవితం మరియు కొత్త ప్రయాణం: దర్శకుడు రాజ్ నిడిమోరుతో ప్రేమలో పడిన సమంత, గత ఏడాది కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రంలో యోగిక్ పద్ధతిలో వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి ప్రాజెక్టుల ద్వారా వీరిద్దరి ప్రయాణం సాగింది. ఇక తల్లిగా కొత్త బాధ్యతలను స్వీకరిస్తూనే, అటు ప్రొఫెషనల్ లైఫ్‌ను అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తున్న సమంత, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలతో మరింత గొప్ప స్థాయికి ఎదగాలని అభిమానులు మనసారా కోరుకుంటున్నారు.

# ఆ ఇమేజ్‌ను మోయడం ఒక భారం..

## అలాంటి హీరోలను చూస్తే జాలేస్తుంది: నాని



'ది ప్యారడైజ్' వంటి భారీ యాక్షన్ చిత్రంతో విజయం అందుకున్నప్పటికీ, తనకు 'మాస్ హీరో' ట్యాగ్ పై ఆసక్తి లేదని నేచురల్ స్టార్ నాని స్పష్టం చేశారు. ఆ ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి నిరంతరం శ్రమించే నటులను చూస్తే తనకు జాలేస్తుందని ఆయన అన్నారు. 'హాలీవుడ్ రిపోర్టర్' ఇండియాకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో నాని ఈ వ్యాఖ్యలు చేశారు. "నా సినిమాల ఎంపికను చూస్తేనే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది కదా? 'దసరా' తర్వాత నేను 'హాయ్ నాన్న' లాంటి ఫీల్ గుడ్ సినిమా చేశాను. ఇప్పుడు 'బ్లడీ రోమియో' తర్వాత కూడా ఒక సున్నితమైన ప్రేమకథను చేస్తున్నాను. నా ఎంపికలు ఎప్పుడూ మాస్ ఇమేజ్ కోసం ఉన్నట్లు సూచించలేదు" అని నాని వివరించారు. మాస్ హీరో ఇమేజ్ వల్ల విపరీతమైన ఒత్తిడి ఉంటుందని నాని అభిప్రాయపడ్డారు. "ఆ ఇమేజ్ కోరుకునే వారు నిరంతరం భారీ చిత్రాలు చేయాల్సి ఉంటుంది. మనసుకు నచ్చిన కథలను ఎంచుకునే స్వేచ్ఛ ఉండదు. ఎన్నో లెక్కలు వేసుకోవాలి. అలాంటి భారాన్ని నేను మోయాలనుకోవడం లేదు" అని ఆయన అన్నారు. అయితే, ఒక నటుడిగా 'ది ప్యారడైజ్' కంటే పెద్ద, భారీ చిత్రాలు చేసే అవకాశం ఉందని, కానీ ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన సినిమాలు చేస్తూనే ఉంటానని ఆయన తేల్చిచెప్పారు. తెలుగు చిత్ర పరిశ్రమలో 18 ఏళ్లుగా తాను ఉన్న స్థానం పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నానని, ఇంతకంటే పెద్ద స్టార్ అవ్వాలనే ఆశ తనకు లేదని నాని పేర్కొన్నారు. ఓపెనింగ్స్, ఇమేజ్ కంటే మంచి చిత్రాలకే తాను ఎక్కువ విలువిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# అనుపమ పరమేశ్వరన్ 'క్రేజీ కల్యాణం'.. రిలీజ్ డేట్ మారింది!



అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త తెలుగు చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ విడుదల తేదీ మారింది. తొలుత అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా.. ఇప్పుడు అక్టోబర్ 16న థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీ మారిన విషయాన్ని అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. "క్రేజీ కల్యాణం ముహూర్తం ఫిక్స్.. అక్టోబర్ 16న మీ అభిమాన థియేటర్లలో" అంటూ ఆమె పోస్ట్ చేసింది. ఇటీవల విడుదలైన సినిమా టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. కీర్తి పాత్రలో అనుపమ కనిపించనుంది. ఆమె తండ్రిగా సీనియర్ నటుడు నరేశ్ నటించాడు. కూతురి పెళ్లిని ఘనంగా చేయాలని కోరుకునే తండ్రి పాత్రలో అతను కనిపిస్తాడు. కీర్తికి మంచి సంబంధం చూడటంలో భాగంగా తండ్రి పడే తాపత్రయం.. కుటుంబంలో చోటుచేసుకునే సరదా గొడవలు టీజర్‌లో నవ్వులు పూయించాయి. అయితే కీర్తి మాత్రం తనకు నచ్చినట్టే జీవించాలని భావిస్తుంది. ఆమె మొండితనం కూడా కథలో కీలకంగా కనిపిస్తోంది. అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమారి, నరేశ్, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాతో బద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నాడు. శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టాడు. శ్రవణ్ కటికనేని ఎడిటర్‌గా పనిచేశాడు. సినిమా కథను బద్రప్ప గాజులే రాశాడు.

# మరోసారి తల్లిదండ్రులు కాబోతున్న కియారా, సిద్ధార్థ్..

హీరోయిన్ కియారా అద్వాణీ, హీరో సిద్ధార్థ్ మల్హోత్ర మరోసారి తల్లిదండ్రులు కానున్నారు. ఈ శుభవార్తని వీరు సోషల్‌మీడియా వేదికగా పంచుకున్నారు. 'మా హృదయాలు ప్రేమతో నిండిపోయాయి' అంటూ ఈ వార్తను షేర్ చేశారు. దీంతో అభిమానులు, సెలబ్రిటీలు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గతేడాది జూలై 16న వీరికి పాప పుట్టింది. 2021లో విడుదలైన 'షేర్షా' సినిమాలో సిద్ధార్థ్, కియారా నటించారు. ఆ సినిమా షూటింగ్‌లోనే వీరిద్దరి మధ్య ప్రేమ పుట్టింది. 'కాఫీ విత్ కరణ్' సీజన్ 8లో కియారా తన ప్రేమకథని పంచుకుంది. 2023 ఫిబ్రవరి 7న రాజస్థాన్‌లో వీరి వివాహం జరిగింది



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613